క్లుప్తంగా

పత్తిపంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



పత్తిని పరిశీలిస్తున్న అధికారి శ్రీకాంత్

రామగిరి: పత్తిపంటలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి చిందం శ్రీకాంత్ సూచించారు. మండలంలోని రత్నాపూర్‌లో శుక్రవారం ఆయన పత్తి, వరి పంటలను పరిశీలించారు. రైతులు పొలాల్లో ఉన్న వర్షపు నీటిని వెంటనే బయటకు పంపించాలన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు అరవింద్, మౌనిక, నవీన్, రైతులు పాల్గొన్నారు.

బాలుర వసతిగృహం తనిఖీ

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని బాలుర ఎస్సీ వసతిగృహాన్ని శుక్రవారం మండల ప్రత్యేక అధికారి ఆదిరెడ్డి తనిఖీ చేశారు. వసతిగృహంలోని పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని వసతులు కల్పించాలని సూచించారు. అనంతరం సమీపంలోని నివాస గృహాలకు వెళ్లి ఇంటి పరిసరాలను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీవో భాస్కర్, కార్యదర్శి తిరుపతి, వార్డెన్ వెంకటస్వామి ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియా ఎస్‌అండ్‌పీసీలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్న నల్లవెల్లి కనకయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. తోటి సెక్యూరిటీ సిబ్బంది సీనియర్ ఇన్‌స్పెక్టర్ రాజలింగు, జూనియర్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి సెక్యూరిటీ సిబ్బందితో కలసి రూ.91వేలు సేకరించి మృతుడి కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు.

కస్తూర్బా పాఠశాల తనిఖీ

రామగిరి: మండలంలోని పన్నూర్ కస్తూర్బా పాఠశాలను శుక్రవారం ఎంపీడీవో శైలజారాణి ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. వంట గదిని పరిశీలించి పిల్లలకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు మండల వైద్యాధికారి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఎంపీవో ఉమేశ్, స్పెషల్ ఆఫీసర్ మంజు, సీహెచ్‌వో భరత్, కార్యదర్శి ప్రేమలత పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

సుల్తానాబాద్‌రూరల్: పాఠశాలలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో దివ్యదర్శన్ సూచించారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లిలోని గురుకుల పాఠశాలను శుక్రవారం ఎంపీడీవో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను పరిశీలించారు. అనంతరం వంటశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. పీఆర్‌డీఈ దేవేందర్, ప్రిన్సిపాల్ గిరిజా, కార్యదర్శి లచ్చయ్య ఉన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

గోదావరిఖనిటౌన్: స్థానిక రాంనగర్ ఏరియాకు చెందిన న్యాయవాది దాసరి ఉపేందర్(45) శుక్రవారం గుండెపోటుతో ఆయన నివాసంలో మృతిచెందాడు. గోదావరిఖని బార్ అసోసియేషన్ పిలుపు మేరకు శుక్రవారం ఉపేందర్ మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. గోదావరిఖని అదనపు జిల్లా న్యాయస్థానం, సీనియర్ సివిల్ జడ్జి కోర్టుతో పాటు మూడు మున్సిఫ్ కోర్టుల్లో విధులు బహిష్కరించి అనంతరం సంతాప సభ నిర్వహించారు. బార్ అసోసియేషన్ నాయకులు కొలిపాక ప్రవీణ్‌కుమార్, బాస అనురాధ, చందాల శైలజ, కిషన్‌రావు, మధు, చంద్రశేఖర్, ఎం.కుమార్ పాల్గొన్నారు.

‘మోడల్’లో ఫ్రెషర్స్ డే



ధర్మారం: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో శుక్రవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలికారు. విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. ప్రిన్సిపాల్ మన్నె దీనా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలకు ఏర్పాట్లు చేయండి

- రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో గణేశ్ ఉత్సవాలను మరింత శోభాయమానంగా నిర్వహించేందుకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఆదేశించారు. గణేశ్ నిమజ్జన ఏర్పాట్లపై శుక్రవారం మేయర్ బంగిఅనిల్ కుమార్ అధ్యక్షతన నగరపాలక సంస్థ కార్యాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. అన్నిశాఖల అధికారులు చేపట్టాల్సిన ఏర్పాట్లపై ఎమ్మెల్యే సమీక్షించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి లోటుపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శనివారం నుంచే పండుగ వాతావరణం కనిపించేలా నగరంలోని అన్ని కూడళ్లను అలంకరించాలని సూచించారు. ఆయా సంస్థలకు కేటాయించిన అన్ని పనులను సకాలంలో బాధ్యతాయుతంగా నిర్వర్తించి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని కోరారు. విద్యుత్ సరఫరా నిలిచిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎన్పీడీసీఎల్ అధికారులను ఆదేశించారు. ఏసీపీ రమేశ్ మాట్లాడుతూ డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. సమావేశంలో కార్పొరేటర్లు మహంకాళి స్వామి, బాల రాజ్‌కుమార్, కొలిపాక సుజాత, పెద్దెల్లి తేజస్విని ప్రకాశ్, ముస్తఫా, ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు, వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, టూటౌన్ సీఐ ప్రసాదరావు, ట్రాఫిక్ సీఐ రాజేంద్రప్రసాద్, తహసీల్దార్ కుమారస్వామి, సింగరేణి ఎస్ఈ చంద్రశేఖర్, డిప్యూటీ ఎస్ఈ జె.శ్రీనివాస్, వసంత కుమార్, ఎన్టీపీసీ అధికారి సూర్యనారాయణ, ఆర్ఎఫ్‌సీఎల్ అధికారులు శుక్లా, వంశీకృష్ణ, డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, ఎన్పీడీసీఎల్ ఏఈ హరీశ్, ఫైర్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ, విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు రవి, వెంకన్న, బజరంగ్‌దళ్ ప్రతినిధి సంపత్, ఉత్సవ కమిటీ ప్రతినిధి జలంధర్ పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాలను పూజిద్దాం



గోదావరిఖని: ప్రతిమలు అందజేస్తున్న అధికారులు



గోదావరిఖని: అందిస్తున్న జీఎం సూర్యనారాయణ



కోల్‌సిటీ: పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్



గోదావరిఖనిటౌన్: పంపిణీ చేస్తున్న మనాలి ఠాకూర్



రామగిరి: పంపిణీ చేస్తున్న జీఎం సుధాకర్‌రావు



సుల్తానాబాద్: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

గోదావరిఖని: మట్టి గణపతులను ప్రతిష్ఠించి పూజించాలని ఆర్జీ–1 ఎస్‌వోటూ జీఎం రాంమోహన్ కోరారు. జీఎం కార్యాలయంలో కాలుష్య నియంత్రణ మండలి, పర్యావరణ విభాగం ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు.

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం మట్టి వినాయక విగ్రహాల ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.

పాలకుర్తి: మండలంలోని జీడీనగర్ గ్రామ యూనివర్సల్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మట్టి గణపతి విగ్రహాలను ఇంటింటికీ పంపిణీ చేశారు.

సుల్తానాబాద్: మండల కేంద్రంలో ఇండియన్ పబ్లిక్ స్కూల్, నేహా కాన్సెప్ట్, పూసాల, గాంధీనగర్‌లో మట్టి విగ్రహాలను ప్రజలకు పంపిణీ చేశాయి.

గోదావరిఖనిటౌన్: లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని స్ఫూర్తి ఆధ్వర్యంలో స్థానిక స్వతంత్ర చౌక్‌లో మట్టి గణపతులను పంపిణీ చేశారు.

గోదావరిఖని: జీఎం కార్యాలయంలో మట్టి వినాయక విగ్రహాలను ఆర్జీ–2 జీఎం ఎల్వీ సూర్యనారాయణ పంపిణీ చేశారు.

ఓదెల: మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందికి సీనియర్ అసిస్టెంట్ వెంకన్న మట్టి వినాయకులను శుక్రవారం పంపిణీ చేశారు.

గోదావరిఖనిటౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎకో ఫ్రెండ్లీ గణేశ్ సంబరాలు నిర్వహించారు.

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని ఊశన్నపల్లె ప్రాథమిక పాఠశాల విద్యార్థులు బొజ్జ గణపయ్యలను తయారుచేసి గ్రామంలో పంపిణీ చేశారు.

గోదావరిఖనిటౌన్: స్థానిక ప్రధాన చౌరస్తాలో మట్టి వినాయకులు పంపిణీ చేశారు.

రామగిరి: ఆర్జీ–3 జీఎం కార్యాలయంలో కార్యాలయ సిబ్బందికి ఆర్జీ–3 జీఎం ఎస్.సుధాకర్‌రావు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.

సీఎస్‌పీ కార్మికులకు పదోన్నతి కల్పించాలి

గోదావరిఖని: ఆర్జీ–1 ఏరియా సీఎస్‌పీలో పనిచేస్తున్న కార్మికులకు పదోన్నతి కల్పించాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. సీఎస్‌పీ ఎస్ఈని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కొన్నేళ్లుగా పదోన్నతులు రాక కార్మికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. నాయకులు బండి మల్లేశ్, ఎస్.వెంకట్‌రెడ్డి, బుడిమె సమ్మయ్య, జానిమియా, కొత్వల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న జీఎం సూర్యనారాయణ

గోదావరిఖని: ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3లో ఈపీ ఎలక్ట్రీషియన్ పి.రామయ్య కుమారుడు అభినయ్‌కు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెక్కును జీఎం ఎల్వీ సూర్యనారాయణ శనివారం అందజేశారు. జీఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అభినయ్ తండ్రి రామయ్యకు రూ.2లక్షల విలువైన చెక్కును అందించారు. అధికారులు సంతోష్‌కుమార్, అనిల్‌కుమార్, శ్యాంసన్ పాల్గొన్నారు.

పెద్దంపేటలో రైల్వే వంతెన నిర్మించాలి

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేటలో రైల్వే ఓవర్ బ్రిడ్జితో పాటు పలు ప్యాసింజర్ రైళ్లకు హాల్టింగ్ కల్పించాలని గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు గడ్డం మధుగౌడ్ కోరారు. గురువారం పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. గ్రాండ్ రూట్‌లో ఉన్న పెద్దంపేట రైల్వేస్టేషన్‌లో కోవిడ్‌కు ముందు పలు ప్యాసింజర్ రైళ్లకు హాల్టింగ్ ఇచ్చిన రైల్వేశాఖ కోవిడ్ అనంతరం సిర్పూర్‌కాగజ్‌నగర్, నాగ్‌పూర్ (అజ్నీ), రామగిరి ప్యాసింజర్ రైళ్ల హాల్టింగ్ ఎత్తివేశారన్నారు. రైల్వే ఫ్లైఓవర్ వంతెన నిర్మాణానికి ప్రత్యేక చొరవ చూపించాలని విన్నవించారు.

సంక్షిప్త వార్తలు

- **పెద్దపల్లి ఎంపీ పరామర్శ**

ధర్మారం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ధర్మారం మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కాడే సూర్యనారాయణను పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ శుక్రవారం పరామర్శించారు. నాయకులు జనార్దన్, తిరుపతిరావు, ఎల్లయ్య, రమేశ్ ఉన్నారు.

- **కేజీబీవీలో దరఖాస్తుల ఆహ్వానం**

పాలకుర్తి: మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో అసిస్టెంట్ వంట మనిషి(కుక్) పోస్టుకు పూర్తిస్థాయిలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన అర్హత కలిగిన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి రాజయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18ఏళ్ల పైబడి పదో తరగతి ఉత్తీర్ణత పొంది మండల పరిధిలో నివసిస్తున్న మహిళలు ఈ పోస్టుకు అర్హులన్నారు. అభ్యర్థులు తమ బయోడేటా ఫాంతో పాటు సర్టిఫికెట్లు జతచేసి పుట్నూర్‌లోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం ప్రత్యేక అధికారి కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4లోపు అందజేయాలని ఎంఈవో రాజయ్య కోరారు. గతంలో ప్రభుత్వ గుర్తింపు పొందిన హాస్టల్, గురుకుల, రెసిడెన్షియల్ పాఠశాలలో వంటపని చేసిన అనుభవం ఉండాలని తెలిపారు. ఈనెల 12 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు.

- **వర్గీకరణ సదస్సు విజయవంతం చేయాలి**

కమాన్‌పూర్: కరీంగనర్‌లోని పద్మనగర్ ఇందిరాగార్డెన్‌లో ఈ నెల 10న నిర్వహించే షెడ్యూల్ కులాల ఏబీసీడీ వర్గీకరణపై నిర్వహించే సదస్సు విజయవంతం చేయాలని మండల కేంద్రంలో శుక్రవారం మాదిగల ఐక్యవేదిక నాయకులు పోస్టర్ ఆవిష్కరించారు. ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సముద్రాల అజయ్, కుక్క చంద్రమౌళి, చిప్పకుర్తి సత్యనారాయణ, అరుణ్, రామస్వామి, రాజు, సతీశ్, శ్రీనివాస్, తిరుపతి పాల్గొన్నారు.

- **వృత్తి విద్య విద్యార్థులకు శిక్షణ**

రామగుండం: రామగుండం ప్రభుత్వ ఐటీఐలో ఎలక్ట్రీషియన్ పూర్తి చేసిన లేదా ఎలక్ట్రీషియన్ పూర్తి చేయబోతున్న విద్యార్థులకు ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకంలో భాగంగా వారంపాటు రూఫ్‌టాప్ సోలార్ పీవీ (ఇన్‌స్టాలేషన్ అండ్ మెయింటెనెన్స్)పై శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ సురేందర్ తెలిపారు. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసిన వారికి సీబీటీ పరీక్ష నిర్వహించి స్కిల్ డెవలప్‌మెంట్ ధృవీకరణపత్రం అందజేస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు ఈనెల 12వ తేదీలోగా ఐటీఐలో దరఖాస్తు చేసుకోవాలని శిక్షణ అధికారి విద్యాసాగర్‌రెడ్డి సూచించారు.

- **ఉపయోగంలో లేని పరికరాలకు వేలం**

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని జిల్లా ప్రభుత్వ హాస్పిటల్‌లో ఉపయోగంలో లేని పరికరాలను వేలం వేయనున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ తెలిపారు. ఈ వస్తువులను బిడ్డర్స్ పరిశీలించి సీల్డ్ కోటేషన్‌లను ఈ నెల 10 నుంచి 16వ తేదీ వరకు సమర్పించాలని సూచించారు. 18న కొటేషన్స్ తెరిచి ఎక్కువ మొత్తం కోట్ చేసిన వారికి పరికరాలను అప్పగించనున్నట్లు పేర్కొన్నారు.

- **ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం**

జూలపల్లి: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులను ఆయా పాఠశాలల్లో సన్మానించారు. జూలపల్లి ప్రభుత్వ ఉన్నతబాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరస్వతిని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు అమరగాని అన్నపూర్ణ సన్మానించారు. పెద్దాపూర్ ఎంపీపీఎస్ ఉపాధ్యాయురాలు త్రివేణిని బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు కంకణాల జ్యోతిబసు సన్మానించారు.

- **తెలుగు ఉపాధ్యాయుడికి..**

మంథని: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో తెలుగు అధ్యాపకుడిగా పనిచేస్తున్న నవీన్ జోనల్ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. కాగా ప్రిన్సిపాల్ శ్రీనాథ్ శుక్రవారం సన్మానించారు.

- **బదిలీ ఉపాధ్యాయులకు..**

ఓదెల: ఓదెల హైస్కూల్లో ఉపాధ్యాయులుగా పనిచేసి ఇటీవల బదిలీ అయిన చిర్ర రవీందర్, శారద, సురేశ్, బండి కుమారస్వామితో పాటు ఆఫీస్ సబార్డినేట్ శంకరయ్యను పాఠశాల హెచ్‌ఎం పద్మ ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు.

- **మట్టి గణపతులనే పూజించండి**

పెద్దపల్లిరూరల్: మట్టి గణపతులను పూజించాలని పెద్దపల్లి ఎస్సై లక్ష్మన్‌రావు సూచించారు. పట్టణంలో లయన్స్ క్లబ్ ఆఫ్ రంగనాయక ఆధ్వర్యంలో శ్రీనిధి చిట్ ఫండ్ వారి సహకారంతో 200 మట్టి గణపతులను పంపిణీ చేశారు.

- **అడ్వకేట్ నేత్రాలు సజీవం**

కోల్‌సిటీ: గోదావరిఖని రాంనగర్‌కు చెందిన దాసరి ఉపేందర్(42) అనే అడ్వకేట్ గురువారం గుండెపోటుతో మృతి చెందారు. కాగా కుటుంబ సభ్యుల అంగీకారం మేరకు శుక్రవారం మృతుని నేత్రాలను సదాశయ ఫౌండేషన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి కే.ఎస్.వాసు, జిల్లా సలహాదారులు దేవి లక్ష్మీనర్సయ్య, పట్టణ కార్యదర్శి బోళ్ల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎల్వీ ప్రసాద్ ఐబ్యాంక్ టెక్నీషియన్ నరేందర్ సహకారంతో సేకరించి హైదరాబాద్‌కు తరలించారు. నేత్రదాత కుటుంబ సభ్యులను ఫౌండేషన్ ప్రతినిధులతోపాటు మాజీ ఎంపీటీసీ దేవి స్రవంతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తొటం సతీశ్, జాయింట్ సెక్రటరీ పులిపాక ప్రవీణ్ కుమార్, ట్రెజరర్ గజ్జెటి సత్యనారాయణ, అడ్వకేట్లు సీహెచ్.శైలజ, పెద్దెల్లి ప్రకాశ్ అభినందించారు.

- **క్షీరాభిషేకం**

యైటింక్లయిన్‌కాలనీ: యైటింక్లయిన్‌కాలనీ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ చిత్రపటాలకు శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. నియోజకవర్గం అభివృద్ధికి రూ.24 కోట్ల నిధులు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ స్థానిక తెలంగాణ చౌరస్తాలో క్షీరాభిషేకం చేశారు.

- **యునానీ ఉచిత వైద్యశిబిరం**

రామగిరి: బేగంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం యునానీ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

- **పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి**

ముత్తారం: గ్రామాల్లో ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో సురేశ్ కోరారు. శుక్రవారం ముత్తారంలో ఇళ్లను పరిశీలించారు. డ్రైనేజీ శుభ్రం చేయాలని కార్యదర్శిని ఆదేశించారు.

- **ఉచితంగా హోమియో మందుల పంపిణీ**

మంథని: పట్టణంలోని సిరి హోమియో క్లినిక్‌లో సీజనల్ వ్యాధుల నివారణ మందులను గ్లోబల్ హోమియోపతి, సువర్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణీ చేశారు.



రామగిరి: మండలంలోని ఆయా గ్రామాల్లో తిరిగే వీధి కుక్కలకు వింత రోగం సోకింది. వ్యాధి సోకిన కుక్కల చర్మం మొత్తం ఊడిపోయి భయంకరంగా కనిపిస్తున్నాయి. కొద్దిరోజుల కిందట ఒకట్రెండు కుక్కలకు మాత్రమే ఈ వ్యాధి సోకగా క్రమంగా వాటి సంఖ్య పెరుగుతోంది. అధికారులు స్పందించి కుక్కలను ఊరి నుంచి తరిమివేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై మండల పశువైద్యాధికారి దుర్గాప్రసాద్‌ను సంప్రదించగా, ఇది దర్మటైటిస్ అనే చర్మవ్యాధి అని తెలిపారు. ఇన్‌ఫెక్షన్ ద్వారా జంతువులకు సోకుతుందని, వీధి కుక్కలలో ఎక్కువగా కనిపిస్తుందన్నారు. దీంతో మనుషులకు ఎలాంటి ప్రమాదం ఉండదని, ఇది జంతు సంక్రమిత వ్యాధి మాత్రమేనని పేర్కొన్నారు.

వాట్సప్ చేయండి..

మా ఫోన్ నంబర్ : 94403 81258

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

ఉత్సవాలను బాధ్యతగా నిర్వర్తించాలి

యైటింక్లయిన్‌కాలనీ: గణపతి నవరాత్రి ఉత్సవాలను మండపాల నిర్వాహకులు బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని గోదావరిఖని ఏసీపీ ఎం.రమేశ్ సూచించారు. గోదావరిఖని టూటౌన్ పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం యైటింక్లయిన్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో సింగరేణి ఆర్జీ–2 జీఎం సూర్యనారాయణతో కలిసి ఆయన మాట్లాడారు. ప్రతీ గణపతి విగ్రహానికి జియో ట్యాగింగ్‌తో పాటు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పోటీతత్వంతో కాకుండా భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో టూటౌన్ సీఐ ఎన్.ప్రసాద్‌రావు, రెండో సీఐ లింగమూర్తి, పోలీస్ సిబ్బంది, కాలనీ గణపతి ఉత్సవ కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు, టూటౌన్ పరిధిలోని గణపతి మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోదావరిఖని ఏసీపీ రమేశ్

ప్రశాంతంగా జరుపుకోవాలి

మంథని: వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని గోదావరిఖని ఏసీపీ మడత రమేశ్‌గౌడ్, మంథని ఆర్డీవో హనుమానాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక ఏఎల్ఆర్ ఫంక్షన్ హాల్‌లో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. మంథని సీఐ రాజు గౌడ్, ఎస్సై రమేష్, పీస్ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

యువత వినాయక మాల ధరించడం శ్రేష్ఠం

గోదావరిఖనిటౌన్: గణేశ్ మండపాలలో యువత భక్తి భావనతో వినాయక మాల ధరించడం శ్రేష్ఠమని పురోహిత సంఘం, విశ్వహిందూ పరిషత్ సభ్యులు గణపతి మండపాల నిర్వహణ యువతకు పిలుపునిచ్చారు. స్థానిక శారదనగర్‌లోని విశ్వహిందూ పరిషత్ భవనంలో అర్చక పురోహితుల సంఘం, విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. అర్చక పురోహిత సంఘం అధ్యక్షులు ఓజ్జల వెంకటేశ్వరశర్మ, వీహెచ్‌పీ నాయకుడు అయోధ్య రవీందర్ మాట్లాడారు. ఆది దేవుడు మహా గణపతి మాలధారణ యువత ప్రారంభించాలని వారు కోరారు. ముష్కె సంపత్ యాదవ్, గోవర్ధనగిరి శశిధరచార్యులు, రాంపల్లి వామనశర్మ, పండిత రాజనరేశ్‌శర్మ, రుద్రబట్ల సంతోష్‌శర్మ, మోడెం సురేందర్, నేరేడుకొమ్మ వెంకటస్వామి, మునగాల సంపత్, ఆరెల్లి జలందర్, పైతరి రాజు, పొన్నం అంజయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పురోహితులు

ఎన్టీపీసీ ప్రహరీ నిర్మాణాన్ని అడ్డుకున్న గ్రామస్తులు

పాలకుర్తి: మండలంలోని బామ్లానాయక్‌తండా గ్రామ శివారులో ఎన్టీపీసీ సంస్థ నిర్మిస్తున్న ప్రహరీ నిర్మాణాన్ని శుక్రవారం తండావాసులు, కన్నాల గౌడ కులస్తులు అడ్డుకున్నారు. గోడ నిర్మాణంతో తాము ఉపాధి కోల్పోతామని కన్నాల గౌడ కులస్తులు, తమ పశువులు మేతకు వెళ్లేందుకు దారిలేకపోవడంతో మూగజీవాలకు మేత కరువవుతుందని గ్రామస్తులు వాపోయారు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న ఎన్టీపీసీ డీజీఎం దేవేందర్‌రావు స్థానికులతో మాట్లాడారు. పనులను అడ్డుకోవడం సరికాదని, సమస్యలపై చర్చించి పరిష్కరించుకోవాలని సూచించారు. దీంతో బామ్లానాయక్‌తండా గ్రామ తాజా మాజీ సర్పంచ్ బదావత్ రాజునాయక్, మాజీ వార్డుసభ్యుడు శామ్యూల్, కన్నాల గౌడసంఘం నాయకులు నేరేళ్ల శ్రీను, సముద్రాల కనుకయ్య, బుర్ర సది ఎన్టీపీసీ హెచ్ఆర్ కార్యాలయానికి వెళ్లి తమ సమస్య విన్నవించారు. స్పందించిన హెచ్ఆర్ అధికారి శికధర్ గౌడ కులస్తులు రాకపోకలు సాగించేందుకు వీలుగా కొంతమేర ఖాళీస్థలం వదిలి గోడ నిర్మాణం చేపడుతామని హామీ ఇచ్చినట్లు మాజీ సర్పంచ్ రాజునాయక్ తెలిపారు.



పనులను అడ్డుకుంటున్న స్థానికులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

రామగిరి: మండలంలోని రాజాపూర్ వందన పాఠశాలలో 1995–96లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు శుక్రవారం సెంటనరీకాలనీ కమ్యూనిటీహాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ ముడుసు లక్ష్మణ్, ఉపాధ్యాయులు శేఖర్, శంకర్, రాజేందర్, మధు, దనంజయ్, లక్ష్మణ్,రాజేశ్‌ను సన్మానించి జ్ఞాపిక బహూకరించారు.

ఐఎన్‌టీయూసీలో చేరిక



యూనియన్‌లోకి ఆహ్వానిస్తున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని: టీబీజీకేఎస్‌లో కొన్నేళ్లు పనిచేసిన గంద్ర దామోదర్‌రావు శుక్రవారం ఐఎన్‌టీయూసీలో చేరారు. స్థానిక జనక్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో యూనియన్‌లో చేరిన దామోదర్‌రావుకు ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. అలాగే టీబీజీకేఎస్ బ్రాంచి సెక్రటరీగా పనిచేసిన కుషనపెల్లి శంకర్ ఐఎన్‌టీయూసీలో చేరారు. నాయకులు ధర్మపురి, లక్ష్మీపతిగౌడ్ పాల్గొన్నారు.

బాలికల కాలేజీలో ఫ్రెషర్స్ డే

పెద్దపల్లిరూరల్: పట్టణంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. జిల్లా ఇంటర్ విద్యాధికారి డి.కల్పన అతిథిగా హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ మైత్రేయి, బాలుర కాలేజ్ ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.